# పంచదార చిలక

—ఎస్. శివనాగేశ్వర రావు

'మన ఊళ్లో తిర్నాల రేపే! నీవూ వస్తావా?' అంది గౌరి. ఆ ప్రశ్నకు చెంద్రి క్షణమాలోచించింది. దానికి తిర్నాలకు వెళ్లాలంటే మహా సరదా. అయితే అయ్యకు తెలిస్తే ఒప్పుకోడు. 'వయసొచ్చిన పిల్లవు... రేపో, మాపో మనువు కావలసిన దానివి. తిర్నాల కెళ్తావా?' అని తిడతాడు. అమ్మకు చెప్పినా ఒక్కటే! చెప్పకపోయినా ఒకటే! నోరులేని మనిషి.

తను తిరుణాలకెళ్లి అయిదారేళ్లు దాటిపోయింది. 'కుర్రకారు అసలు మంచోళ్లు కాదు. తిర్నాలకొద్దు' అని ఖరాఖండిగా చెప్పేశాడు. అంతటితో చెంద్రి ఆ కోరిక చంపుకుంది. ఏడాదికోసారి జరిగే తిరుణాల గొప్ప కనులపండుగగా వుంటుంది.

గౌరి అడగడంతో చెంద్రి మనసులోని తిర్నాల చూడాలన్న కోరిక మరలా ప్రాణం పోసుకుంది. అయ్య ఊళ్లోలేడు. తను తిర్నాలకు వెళ్లినా తెలీదు. ఒకవేళ తెలిసినా గౌరి తోడుంది కాబట్టి ఏమీ అనడు. ఆ ఆలోచన చెంద్రికి నచ్చింది.

అందుకే మరిక సంశయించక 'నేనూ వస్తానే గౌరీ!' అంది. 'అయితే సరే బువ్వ తినేసి మద్దేనం వేళకి బయలుదేరి సాయంవేళకు వచ్చేద్దాము' అంది గౌరి. అందుకు సై అంది చెంద్రి. గౌరి వెళ్లిపోయింది.

ఆ రాత్రి దానికి నిద్రపట్టలేదు. తెల్లారిపోయింది. చెంద్రి గుడిసెముందు కళ్లాపి జల్లి ముగ్గేసింది. పూలు కోసి మాల కట్టింది. కూతురు ముస్తాబు గమనించిన చెంద్రి తల్లి 'ఎక్కడికే పెయాణం' అని అడిగింది.

'గౌరి రమ్మంది. ఎల్లొస్తా!' అంది చెంద్రి. 'తొందరగా వచ్చేయి' అందామె. తిర్నాలకెళ్తున్నట్లు తలచుకుంటే రంగుల సినిమాకు వెళ్తున్నంత ఆనందంగా ఉంది. చెంద్రి గౌరి ఇల్లు చేరింది.

గౌరి ముఖం బాధగా పెట్టి 'నేను రావడం లేదు. తిర్నాలకెళ్లొద్దని అయ్య కట్టడి చేశాడు. గౌరి మాటలకు చెంద్రి ప్రాణం ఉసూరుమంది. 'పోనీ మీ అయ్యను నేను అడిగి చూడనా?' అంది ఆశగా. 'నీవడిగితే మరింత రెచ్చిపోతాడు. వద్దు' అంది గౌరి. అంతటితో చెంద్రి ఆ ప్రయత్నం విరమించింది.

'అయితే నే ఇంటికి పోతున్నా' అని బయలుదేరింది చెంద్రి. 'నీ ఇష్టం' అంది గౌరి. సూర్యుడు నడినెత్తికొచ్చాడు.

చెంద్రి కొంత దూరం నడిచాక కనిపించింది మల్లి. చెంద్రిని చూడగానే 'నే తిర్నాలకు పోతున్నా! నీవూ వస్తావా?' అంది. చెంద్రి మనసులో మరలా ఆశ చిగురించింది. 'పద పోదాం' అంది. ఇద్దరూ పొలం గట్లమీద నడుస్తూ తిర్నాలకు బయలుదేరారు.

తిరునాల జరిగే స్థలం చేరారు. ఇద్దరూ ముందు గాజులకొట్టుకెళ్లారు. చెంద్రి తనకిష్టమైన రంగు గాజులు ఎంపిక చేసుకుని బేరమాడింది. అంతలో చెంద్రి దృష్టి ఓ కుర్రాడిమీద పడింది. వయసు పాతికలోపు వుంటుంది. అతనిపేరు శివుడని, పొరుగూరి కుర్రాడని చెంద్రికి తెలుసు. ఎందుకంటే ఏటా వాళ్ల ఊరిలో జరిగే ఎడ్లబండి పందేల్లో మొదట వచ్చే మొనగాడు అతనే! చెంద్రి అతనిమీద నుంచి దృష్టి మరల్చుకొని 'చెరకురసం తాగుదాం రా' అని మల్లిని తీసుకుపోయి రెండు గ్లాసుల రసం ఇమ్మని డబ్బిచ్చింది. ఇద్దరూ చెరుకురసం తాగుతుండగా శివుడు కూడా అక్కడికే వచ్చాడు.

శివుడు వెళ్లిపోయాక మల్లి, 'చెంద్రీ! ఆడిపేరు శివుడు. తెలుసుగా! ఏటా జరిగే ఎడ్లబండి పోటీల్లో నెగ్గే మగాడు ఆడే!' అంది. ఆ అమ్మాయి చూపులోని మత్తు ఇంకా తగ్గలేదు.

అంతలో మల్లి అన్న కనిపించి 'నీ కోసమే చూస్తున్నా! ఇదుగో డబ్బులు' అని పాతిక రూపాయలు ఇచ్చాడు. 'నీవేడకూ పోకు. మాకు తోడుగా ఉండు' అంది మల్లి. 'నా జట్టు కుర్రాళ్లు ఆడ నాకోసం చూస్తూవుంటారు. కనిపించి అరగంటలో వచ్చేత్తాను. మరేం భయం లేదులే. ఏనాకొడుకైనా అల్లరి చేస్తే చెప్పు. ఆడి కాళ్లు ఇరగ్గొడతా' అన్నాడు మల్లి అన్న. అతని చేతిలో కర్ర ఉంది.

'సర్లె! తొందరగా పోయిరా కలిసి పోదాం' అంది మల్లి. అతనెళ్లిపోయాడు. 'రంగుల రాట్నం తిరుగుదాం. పద!' అంది మల్లి. చెంద్రి చప్పున ఒప్పుకుంది. మనిషికి రూపాయి. ఈసారి డబ్బు మల్లే ఇచ్చింది. ఇద్దరూ రంగుల రాట్నం ఎక్కారు.

అంతలో చెంద్రి దృష్టి దూరంగా నిలబడి తనవంక చూస్తున్న శివుడిమీద పడింది. రంగులరాట్నం తిరగడం మొదలయింది. వేగం పెరిగే కొద్దీ దానికి కళ్లు తిరుగుతున్నట్లు అనిపించింది. తమాయించుకుంది. అంతలో దానికి రాత్రి వచ్చిన కల జ్ఞాపకానికి వచ్చింది. తనలా పడిపోతే పట్టుకోవడానికి శివుడు సిద్ధంగా ఉన్నట్లనిపించింది. మనసు నిండా సిగ్గు దొంతరలు!!

రంగుల రాట్నం ఆగింది. అందరూ దిగేశారు. 'ఇంకొంచెం సేపు తిప్పితే ఆడి సొమ్ము ఏం పోతుందో' అని గొణిగింది మల్లి.

అంతలో కుర్రకారు గుంపు ఎదురొచ్చింది. తప్పుకోకపోతే తమను రాచుకుపోతారని మల్లి, చెంద్రి ఎడమయ్యారు. చుట్టుపక్కల వెతికింది. ఎటుచూసినా జనం.

అంతలో మిఠాయి దుకాణం కనిపించింది. అమ్మకేమైనా కొనాలని ఆ దుకాణం వద్దకు పోయింది. అదే సమయానికి శివుడు అక్కడకు వచ్చాడు. 'ఈ కుర్రాడేంటి? ఏడకుపోతే ఆడ తగులుతున్నాడు. కొంపతీసి ఎంటాడ్డం లేదు కదా!' అనుకుంది చెంద్రి.

'ఏం కావాలి?' అన్నాడు దుకాణం వాడు. 'పంచదార చిలకలు కావాల' అన్నాడు శివుడు. 'పాతిక రూపాయలు' ధర చెప్పాడు దుకాణంవాడు. 'చానా ఎక్కువ చెబుతున్నావు. ఇరవై తీసుకో' అన్నాడు శివుడు. బేరం ఇరవై రెండుకి కుదిరింది. శివుడు డబ్బిచ్చాడు. దుకాణంవాడు పంచదార చిలకలు పొట్లాం కట్టి శివుడి పక్కనే నిలబడి ఉన్న చెంద్రికి అందించాడు.

'నాకెందుకు' అంది చెంద్రి దుకాణం వాడితో. 'ఫర్లేదు తీసుకో' అన్నాడు శివుడు. ఉరిమి చూసింది చెంద్రి. మరిక ఆ అమ్మాయి పొట్లాం తీసుకోదని శివుడు తానే అందుకున్నాడు.

చెంద్రి మిఠాయి కొనకుండానే వెనుతిరిగింది. ఆ అమ్మాయి ఒక్కతే ఉండటం చూసి నలుగురు రౌడీకుర్రాళ్లు వెంటపడ్డారు. చెంద్రికి భయమేసింది. ఒకడైతే చొరవ చేసి 'వస్తావా' అని చెంద్రి చేయి పట్టుకున్నాడు. చెంద్రికి ఏడుపొచ్చేసింది.

అంతలో అక్కడకు వచ్చాడు శివుడు. 'ఏరా దొంగ నాయాళ్లారా! ఆడపిల్ల చెయ్యి పట్టుకుంటారా! ఎముకలు విరుగుతాయి.' అన్నాడు. శివుడి కండలు తిరిగిన ఒళ్లు... చేతిలోని సాముగారడీ కర్ర చూసి కుర్రాళ్లు వెనక్కి తగ్గారు.

చెంద్రి, శివుడికి కళ్లతోనే కృతజ్ఞతలు చెప్పుకుంది.

'నా పేరు శివుడు. పొరుగూరు మాది' అన్నాడు శివుడు. 'తెలుసు. నా పేరు చెంద్రి. మాదీ ఊరే' అంది చెంద్రి తలదించుకుని.

'నీతో ఓ మాట మాటాడాల' అన్నాడు శివుడు. చెప్పు అంది చెంద్రి. 'ఇంకేం మాట్లాడతాడు. నువ్వంటే నాకిష్టం, అయింది. ఈ రాత్రికి ఈడనే ఉండిపో' అంటాడు అనుకుంది చెంద్రి. శివుడే గనక అలా అడిగితే చెంప పగలగొట్టాలనుకుంది. శివుడు క్షణమాగాడు. తరువాత చెప్పడం మొదలెట్టాడు. 'నాకో ఇబ్బంది వచ్చిపడింది. నాకేమో అయ్య లేడు. ఉన్న అమ్మంటే నాకు వల్లమాలిన పేణం. దానికేమో జబ్బు చేసింది. డాక్టరేమో క్షయ అని మందులు రాశాడు. వాడుతున్నాం గానీ దగ్గు తగ్గలేదు. దానికేమో నా పెళ్లి చూడాలని చాలా ఆరాటంగా ఉంది. మా అమ్మకు క్షయ అని తెలిసి అది బతుకుతుండగా ఎవరు పిల్లనిస్తారు? అక్కడికీ ఇద్దరు ముగ్గుర్ని అడిగాను. 'ఛీ' కొట్టారు. దానితో సగం చచ్చిపోయాను. నీ ఒప్పుకుంటే ఇద్దరం ఈడ ఫోటో దిగుదాం. అది చూపించి 'నీ కాబోయే కోడలు' అని చెప్తాను. రేపో మాపో చచ్చేదే కాబట్టి కాస్తంత సంతోషంగా చస్తుంది' అన్నాడు.

చెంద్రికి, శివుడి మాటలు వింటే గుండె కరిగిపోయింది. వాడెంత మంచోడో అర్ధమయింది. క్షణమాలోచించి నిర్ణయం తీసుకుంది. 'ఫోటో. ఎందుకు? నేనే మీ ఇంటికొస్తాను. మీ అమ్మకు నన్ను చూపించు' అంది.

శివుడి కన్నుల్లో చెప్పలేనంత ఆనందం. 'నీ సాయం మరచిపోను. నిన్ను మా ఊరు తీసుకుపోయి అమ్మకు చూపించి సాయం వేళకు మీ ఊరు చేరుస్తా' అని క్షణంలో ఎడ్లబండి తెచ్చాడు. ఒళ్లంతా జల్లంది. ఎడ్లబండి ఎక్కి కూర్చుంది.

ఎడ్లబండిలో శివుడితో ప్రయాణం చెంద్రికి ఎంతో నచ్చింది. వాడు ఊరు చేరే వరకూ చిన్నప్పుడే అయ్య చచ్చిపోతే తనకు కష్టం తెలీకుండా అమ్మ తననెలా పెంచినదీ చెప్పాడు. అమ్మంటే తనకెంత ప్రేమో చెప్పాడు. వాడి మంచి మనసు తెలిసిపోయింది చెంద్రికి.

గంటలో బండి శివుడింటి ముందు ఆగింది. శివుడు ముందుగా లోనికెళ్లాడు. చెంద్రి బయటే నిలబడింది. 'అమ్మా! నీకిష్టమైన పంచదార చిలకలు తెచ్చానే!' అన్నాడు శివుడు. 'ఎందుకురా అయ్యా! నేనేం తినగలను. పళ్లు ఊడిపోయాయి కదా!' అంది సత్తెమ్మ.

'శుభవార్త వినేప్పుడు తీపి తినాలే! కాస్తంత ముక్క చప్పరించు' అని శివుడు పంచదార చిలకలోని చిన్న ముక్క తుంచి తల్లి నోట్లో వేశాడు. సత్తెమ్మ చప్పరిస్తుండగా శివుడు. చెంద్రిని లోనికి పిలిచి 'అమ్మోయ్! ఇదిగోనే నీ కాబోయే కోడలు పిల్ల!' అన్నాడు.

సత్తెమ్మ ఒళ్లంతా కళ్లు చేసుకుని చెంద్రి వంక చూసింది. 'ఎవరమ్మాయివే నీవు?' అంది. చెంద్రి తన ఊరు... తండ్రిపేరు చెప్పింది.

సత్తెమ్మ సంతోషం వర్ణనాతీతం. మంచం మీదనుంచి లేచి చెంద్రిని వాటేసుకుని బుగ్గ ముద్దాడి 'ఒరేయ్ శివుడూ! ఇందాక నీవు తినిపించిన పంచదార చిలక కంటే ఈ చిలక బావుందిరా' అంది. చెంద్రికి సిగ్గేసింది.

అంతలో సత్తెమ్మకు ఖళ్... ఖళ్‌న దగ్గు తెర వచ్చింది. చెంద్రి తల తిప్పితే మంచినీటి-కుండ కనిపించింది. గ్లాసుతో నీళ్లు తెచ్చి ఆమె చేత తాగించింది. దగ్గు తెర తగ్గింది. 'మా తల్లే' అని చెంద్రి తల నిమిరింది. 'నాకు క్షయ రోగమట అమ్మా! అందుకని నేను బతికుండగా నా కొడుక్కి ఎవరూ పెళ్లినివ్వరట. నాకేమో ఆడి పెళ్లి చూసి చావాలని వుంది' అంది సత్తెమ్మ. 'రోగాలు మనుషులకు కాక మాకులకొస్తాయా? నీవేం దిగులు పెట్టుకోకు. నీ కొడుకుని నేను కట్టుకుంటా' అంది చెంద్రి.

శివుడు బయలుదేరడానికి బండి సిద్ధం చేశాడు. సత్తెమ్మ, చెంద్రి చేతిలో పంచదార చిలకల పొట్లాం పెట్టి 'జాగ్రత్తగా ఎల్లిరామ్మా' అంది. చెంద్రి బండెక్కి కూర్చుంది.

సాయంకాలం అయింది. చల్లగాలి తిరిగింది. చెంద్రి మనసులో ఎన్నెన్నో అనుభూతులు.

నేనడిగిన . దానికంటే ఎక్కువగానే వరాలిచ్చావు చెంద్రీ! నీకు నేను సానా రుణపడివున్నాను. అమ్మ ముఖంలో అంత సంతోషం చూసి చాలా రోజులైంది. నీ వాడింది అబద్ధమే అయినా దాని మనసు సంతోషంతో నిండిపోయింది' అన్నాడు శివుడు.

'నేను మీ అమ్మతో అన్న మాటలు అబద్ధపు మాటలు కాదు. మనసులోంచి వచ్చిన నిజమైన మాటలు' అంది చెంద్రి.

చెంద్రి ఏమంటున్నదో శివుడికి క్షణకాలం అర్థంకాలేదు. అర్థమయ్యాక మరి మీవాళ్లు...' అన్నాడు. 'ఎడ్లబండి పోటీల్లో మొదటొచ్చే మొనగాడు అల్లుడంటే ఎవరు కాదంటారు. కాదన్నా నేను కట్టుకునేది నిన్నే' అంది చెంద్రి.

'శుభవార్త విన్నప్పుడు తీపి తినాలని మీ అమ్మకు చెప్పావుగా! ఇదిగో తిను' అని శివుడి నోటికి పంచదార చిలక అందించింది చెంద్రి. 'చెరిసగం' అని సగం చిలక ఆమె నోటికి అందించాడు శివుడు.